# గోదారమ్మ-2

" అలాగే మీకో సంఘటన చెబుతాను. ఒకసారి సీత వాళ్ళ వూరికి వెళ్ళటానికి ఉదయమే ఫస్టు బస్సుకని తయారైందండీ! అపుడే నేను వచ్చానిక్కడకు. కాఫీ కలిపే ప్రయత్నం చేస్తుంటే, ఆలశ్యం అవుతుందనీ, బస్సు వెళ్ళిపోతే కష్టం అనీ, ఎంత చెప్పినా వినలేదు! పైగా అంత అర్జంటు పనేమీ లేదు లెండి... ఆలశ్యం అయితే ఇంకొక బస్సులో వెళ్తా అంటూ కాఫీ కలిపి, అందరికీ ఇచ్చేకే అపుడు బయలుదేరింది!"

సీత వెంటనే అంది "బాబాయ్... మీరు మరీనూ..డొక్కా సీతమ్మగారు తన ఇంటికి ఎవరు వచ్చినా ఆదరంగా బోజనం పెట్టి పంపేవాళ్ళనే పేరు ఉంది! అంత గొప్పావిడతో నేను సరితూగననేది నా మనసుకు తెలుసు! అయినా మీరు అపుడపుడూ అలా అంటూ వుంటే... ఆ పేరు నాకు పెద్దవాళ్ళు పెట్టినందుకేమో సంతోషంగా అనిపిస్తుంది! నేను కేవలం ఉదయం పూట నలుగురికీ కాఫీ కలిపి ఇవ్వటంలో గొప్పతనం ఏమీ లేదు... నా స్వార్ధమే ఉంది... ఈ మాట మీరు చెప్పినా వినిపించుకోరు! మళ్ళీ చెబుతున్నాను.. మీ నలుగురికీ కాఫీ కలిపి ఇచ్చాక నేను తాగినపుడే నాకు సంతృప్తిగా, సంతోషంగా అనిపిస్తుంది! ఇది నా సంతోషం కోసం చేస్తున్నానంటే... స్వార్ధమేకదా...?"

ఆ ప్రశ్నకు గోదావరమ్మ సీత భుజంతట్టి, చిరునవ్వుతో చూసింది.

"నిజమే సీతా... ఇతరుల అవసరాలను గమనించి, నెరవేర్చటంలో నువ్వు సంతోషాన్ని పొందగలుగుతున్నావంటే... అది నీ మంచి మనసుకు నిదర్శనమేనమ్మా...! మీ అందరి మాటలూ వింటోంటే... మీ మధ్య ఏర్పడిన స్నేహ సంబంధం ఎంత గొప్పదో అర్ధమౌతోంది! మీ లాంటి వాళ్ళతో కలిసి కాసేపయినా కాలక్షేపం చేయగలగటం, సీతలాంటి అమ్మాయితో కలిసి ఉండగలిగే అవకాశం నాకు దొరకటం చాలా మంచి విషయంగా నాకూ ఆనందాన్ని కలిగిస్తోంది!"

ఆ మాటలకు వాళ్ళు నలుగురూ నవ్వు మొహాలతో చూసారు. "మీరు సీతకు వరసకు పెద్దమ్మగారయితే, మాకూ అక్కగారు లాంటివారే! మాకు ఏ సమస్యలు వచ్చినా మీతో పంచుకుంటాం... మా ఇళ్ళల్లో జరిగే శుభకార్యాలకీ మిమ్మల్ని పిలిచి, మీతో కలిసి ఆనందాన్ని పంచుకుంటాం! మనమంతా ఒక కుటుంబమేననుకోండీ!" వాళ్ళల్లో ఒకరు అలా బదులు చెప్పగానే అందరిలో ఆనందం తొంగిచూసింది! చేతులు జోడించి నమస్కారం చెప్పి అందరూ సెలవు తీసుకున్నారు.

* * *

ఆ తరువాత  వారం పది రోజులు మామూలుగానే గడిచిపోయాయి. అలవాటుగా సీత ఉదయమే వచ్చే నలుగురితోపాటుగా తమ ఇద్దరికీ కూడా కాఫీ కలుపుతుంది. వాళ్ళు నలుగురూ ఆ చెట్టు మొదట్లో కూర్చొని కాఫీ తాగుతూ పేపరు తిరగేస్తుంటే సీత తమ ఇంటి వరండాలో వేసిన రెండు కుర్చీలలో గోదావరమ్మతో పాటుగా తనూ కాఫీ కప్పుతో కూర్చుని ఏవో కబుర్లు చెబుతూ ఉంటుంది. ఆ కుర్చీల పక్కనే ఒక చిన్న స్టూలూ వేసింది. రంగా పాలగ్లాసు చేత బట్టుకుని ఆ స్టూలుపై కూర్చుని వాళ్ళ కబుర్లు వినటంతో పాటూ అపుడపుడూ తనూ పాల్గొంటూ ఉంటాడు.

ఆ రోజు... గోదావరమ్మతో సీత అంది "అమ్మా... మీరు వచ్చాక... నా జీవితంలోకి ఓ కొత్త ఆనందం వచ్చినట్లుంది! రోజు మొత్తంలో... ఇలా చల్లగాలికి విశ్రాంతిగా కూర్చుని మీతో కబుర్లు చెబుతూ కాఫీ తాగటం... చాలా బావుండే సన్నివేశంగా మారింది! మునుపు అయితే, రంగా పక్కమీద దొర్లుతూ ఉండేవాడు. నేనేమో వాళ్ళకి కాఫీ ఇచ్చి నాది తాగుతూ హడావుడిగా వంట చేసుకుంటూ ఉండేదానిని. కాఫీ అలా హడావుడిగా గొంతులో పోసుకున్నట్లుండేది. కానీ ఇపుడు కాఫీ తాగటంలో ఏదో ఆనందకరమైన అనుభూతి కలుగుతోంది!"

గోదావరమ్మ నిట్టూర్చింది. "నాకూ అంతే సీతా! జీవితంలో నాకు నచ్చిన అధ్యాయం మొదలయినట్లుగా అనిపిస్తోంది... ఇలా... నీతో, రంగాతో మాటలు కలుపుతూ కాఫీ తాగటం చాలా చాలా బావుంది...!"

వెంటనే రంగా తన చేతిలోని ఖాళీ పాలగ్లాసును క్రిందపెట్టేసి, రెండు చేతులతో చప్పట్లు చరుస్తూ "నాకూ చాలా బావుంది! అమ్మమ్మ పక్కనే కబుర్లు చెప్పుకుంటూ నిద్రపోవడం, ఉదయమే అమ్మమ్మతో పాటూ లేవటం... అన్నీ బావున్నాయి....!" అన్నాడు.

వాళ్ళిద్దరూ ఆ మాటలకు గలగల నవ్వారు.

సీత తల వూపుతూ "అవునమ్మా... మునుపయితే, నేను ఎంతలేపినా, గోలచేస్తూ మంచంమీద దొర్లుతూ ఉండేవాడు. ఇపుడేమో మీతో పాటుగా ఉదయమే లేచి తన పనులన్నీ పూర్తి కానిచ్చేసి... ఇలా బుద్ధిగా కూర్చుని పాలు తాగుతున్నాడు ! గొప్ప మార్పు!" అంది నవ్వు మొహంతో రంగా వైపు చూస్తూ.

అలా గోదావరమ్మతో కలిసి ఉండటం వాళ్ళిద్దరికే కాదు, ఆవిడకూ బావుంది. పొద్దున్నే హడావుడి పడుతూ పనులు పూర్తిచేయటంలా లేదు సీతకు. ఖాళీగా హుషారుగా పనులు చేసుకుంటోంది. గోదావరమ్మ అన్నింటిలోనూ సాయంగా ఉండటం వలన సీతకు చాలా ఖాళీగా అనిపిస్తోంది. మునుపు తనకూ, చిన్న పిల్లాడికే వంట చేస్తుండటం వలన సీతకు ఏమంత ఆసక్తిగా ఉండేది కాదు. ఏదో యాంత్రికంగా వంట పూర్తి చేసేది.

ఇపుడు ఓ పెద్దావిడ కూడా తమతో ఉందనే ఆలోచనతో గోదావరమ్మను ఆవిడ ఇష్టాల గురించి వాకబు చేస్తూ, ఏవో రకరకాలు చేయాలనే భావం ఏర్పడింది. అందువలన ఆవిడను కొత్తరకాలు ఏం చేయమంటారో నని అడిగేది.

తనకలా పెద్దరికం ఇచ్చి అన్ని విషయాలూ తనతో చర్చించటం గోదావరమ్మకూ బావుంది. మర్చిపోయిన తన ఇష్టా యిష్టాలనూ గుర్తుచేసుకుంటూ ఏవో చెబుతూండేది. ఎక్కువగా 'ఏముందమ్మా... నీకేది చేయాలనిపిస్తే... అదే చేసెయ్యి... నా కోసం అంటూ ప్రత్యేకించి ఏమీ చేయనవసరం లేదులే' అనేది. సీత మాత్రం.." అలా కాదమ్మా, మునుపు చిన్న పిల్లాడికోసం ఏదో ఒకటిలే అని వాడికి ఇష్టమైనవే ఏదో ఒకటి వండేయటం అలవాటుగా ఉండేది. ఇపుడు మీరూ ఉన్నారు కాబట్టి మీకిష్టమైనవీ...కొత్త రకాలూ, చేయాలనిపిస్తోంది! అలా నేనూ కొత్త రకాల వంటల రుచి చూడలుగుతున్నాకదా!' అని సీత బదులిచ్చేది! ఆ మాటతో ఆవిడకూ సంతోషం కలిగి తనకు వచ్చిన వంటల్ని చేసి చూపిస్తూ ఉండటం అలవాటయింది.

సీత పిల్లాడిని తీసుకుని స్కూలుకు వెళ్ళి సాయంకాలం ఇంటికి రాగానే గోదావరమ్మ అలా వీధి చివరవరకూ నడిచి రామాలయం దగ్గర కాసేపు కూర్చుని రావటం అలవాటయింది.

ఒకరోజు ఆవిడను సీత అడిగింది. "ఏ రోజు మానకుండా గుడికి వెళ్ళొస్తున్నారూ... అక్కడ కాలక్షేపం బావుంటోందా అమ్మా...?"

ఆవిడ తల వూపింది. "అక్కడకు ఓ చిన్న అమ్మాయి వాళ్ళ బాబాయితో వస్తూంటుంది. ఎన్ని మంచి కీర్తనలు ఎంత బాగా పాడుతుందనుకున్నావ్...! నాకా అమ్మాయి పాటలు వినటం చాలా ఇష్టంగా ఉంటుంది. ఆ తర్వాత ఓ పెద్దాయన ప్రవచనాలు చెబుతారు! అలా నాలుగు మంచి మాటలు చెవిని వేసుకోవటం, ఆ తర్వాత అక్కడకు చేరిన నాలాంటి పెద్దవాళ్ళతో ఏవో పిచ్చాపాటీ కబుర్లు కాసేపు చెప్పుకుని ఇంటికి రావటం, మంచి కాలక్షేపంగా ఉంది!" అందావిడ నవ్వు మొహంతో.

సీత ఆవిడవైపు సాలోచనగా చూస్తూ అడిగింది. "అవునమ్మా... అందరూ అనుకుంటున్నారూ... మీరు ఊరు చివర ఉండే నాగులమ్మకు ఇల్లు కట్టుకోమని డబ్బు ఇచ్చారట కదా...?"

ఆ మాటతో ఆవిడకు కొంచెం హుషారొచ్చింది. వివరంగా చెప్పుకొచ్చింది... "అవును సీతా... నాగులమ్మా, వాళ్ళ తోడికోడలవీ.. రెండిళ్ళూ ఆ మధ్య కాలిపోయాయటకదూ, అపుడు ఇళ్ళల్లో ఎవరూ లేరు కాబట్టి ప్రాణ నష్టం అంటూ జరగలేదు గానీ నాగులమ్మ ఇల్లు సగం, పక్కవాళ్ళది పూర్తిగానూ కాలిపోయాయట. ప్రభుత్వం వాళ్ళు ఇద్దరికీ కొంత కొంత డబ్బు పరిహారంగా ఇస్తే, నాగులమ్మ తనకి ఇచ్చింది కూడా వాళ్లకే ఇచ్చేసిందట. అదేమిటని నేను ఆరా తీస్తే ఏం చెప్పిందో తెలుసా... తనూ, తనకి కొడుకు ఒక్కడే కాట్టి సగం మిగిలిన ఇంట్లో ఎలాగో సర్దుకుని ఉండగలుగుతున్నారట. తన తోడికోడలూ వాళ్ళూ పిల్లా పెద్దా కలిపి ఓ పదిమంది వరకూ ఉంటారు కాబట్టి వాళ్ళకి ఇల్లు కట్టుకోవడం, సామాన్లు ఏర్పరచుకోవడం బాగా అవసరం కాబట్టి... తనకి వచ్చిన డబ్బూ వాళ్ళకే ఇచ్చేసానని చెప్పింది. చూశావా... ఆ నాగులమ్మది ఎంత గొప్ప మనసో...! కొడుకూ, తనూ ఇద్దరూ పనుల్లోకి వెళ్తూ ఉంటారు కాట్టి కొంచెం కొంచెంగా డబ్బు దాస్తున్నామనీ, ఇంకొన్నాళ్ళల్లో తామూ ఓ చిన్న ఇల్లు ఏర్పరుచుకుంటామనీ చెప్పింది. ఖాళీ ఉన్నప్పుడల్లా వచ్చి శాస్త్రిగారు చెప్పే మాటల్ని వింటూ ఉంటుందట! చూశావా... అందరం వింటాంకానీ, ఇలా ఆచరణలో పెట్టగలిగేవాళ్ళు ఎంతమంది ఉంటారు చెప్పూ...? నాగులమ్మ చేసిన పని నాకు బాగా నచ్చి నేనూ ఏదో కొంత సాయం చేయాలనిపించి, డబ్బు వద్దంటున్నా ఇచ్చాను, వెంటనే ఇల్లు కట్టుకోమని."

సీత నిట్టూర్చింది. "బావుందమ్మా... మీకూ సంపాదించి ఇచ్చే వాళ్ళు ఎవరూ లేరు. దగ్గరున్న డబ్బుని జాగ్రత్తగా దాచుకోవాలిగదా!... అవసరమైన వస్తువులు నావే మీరూ వాడుకోవచ్చునంటే వినకుండా, నాకూ రంగా కీ అంటూ ఏవో వస్తువులు కొంటూ కొంత డబ్బు ఖర్చు పెట్టేసారు కూడానూ...!" నిష్టూరంగా అంది.

గోదావరమ్మ చిరునవ్వుతో సీతకి సమాధానం చెప్పింది. "నా ఒక్కదానికీ అవసరమైనవి పెద్దగా వుండవు గానీ..నువ్వూ, రంగా చిన్న పిల్లలు...ఎన్నో అవసరాలు వుంటాయి కదా..అందులోనూ నేనెవరో ఏమిటో వివరాలేమీ చెప్పకపోయినా స్వంత కూతురిలా అభిమానిస్తున్న నీకూ, మనవడికీ కాక ఇంకెవరికి కొంటాను చెప్పూ.." అభిమానంగా అంది గోదారమ్మ.'

"నిజమే ననుకోండీ... కానీ మీ దగ్గరున్న డబ్బును కొంచెం జాగ్రత్తగా ఖర్చుపెట్టుకోవాలని చెబుతున్నాను. వివరాలు అడగొద్దని అన్నారుగా...?" అంది సీత మామూలుగా.

ఆవిడ మళ్ళీ చిన్నగా నవ్వింది. "ఫరవాలేదు సీతా... నేనా పెద్దదాన్ని. బాధ్యతలేమీ లేవు. ఎన్నేళ్ళుంటానో తెలియదు. ఉద్యోగం చేసినవాళ్ళకి నెలనెలా పెన్షను అందే ఏర్పాటు ఉన్నట్లుగా నాకూ నెల నెలా కొంచెం కొంచెంగా ఖర్చుపెట్టుకోగలిగే వెసులుబాటు ఉందిలే !"

"అయినా అమ్మా..." అంటూ సీత కొంచెం సంకోచంగా ఆవిడవైపు చూస్తూ మాటలు ఆపేసింది.

ఆవిడ "చెప్పమ్మా ఫరవాలేదు... ఆగిపోయావేం...?" అనటంతో సీత మళ్ళీ మాటలు పొడిగించింది.

"నాకు అమ్మలా ఓ పెద్దదిక్కుగా వచ్చారు. మీరు తోడుగా ఉండటం నాకు చాలా ఆనందంగా ఉంది. కానీ ఖర్చులో మీరు భాగం పెట్టటం నాకు నచ్చటంలేదమ్మా. మీ దగ్గరున్నది మీరు జాగ్రత్త చేసుకోవటమే బావుంటుంది!" చిన్నగా చెప్పింది సీత కొంచెంగా తలవాల్చి.

"అదేం మాట సీతా... నువ్వు చిన్నదానివి. నీ కొడుకు ఇంకా చాలా చిన్నవాడు. ఆ పిల్లాడికి మంచీ చెడ్డా చూసి... సంపాదించి తెచ్చి పోషించే తండ్రిలేడు. నీ జీవితం చక్కగా గడవాలి. పిల్లాడి చదువూ... పోషణా అన్నీ సవ్యంగా సాగాలి! ఇపుడు చెప్పు... డబ్బు ఎవరికి ఎక్కువ అవసరం...? ఎవరు జాగ్రత్తపడాలి...?" నిలదీసినట్లుగా అడిగింది గోదావరమ్మ.

"అవునమ్మా నిజమే.. కానీ నాకు ఉద్యోగం ఉందిగా..." అంటూ ఇంకా ఏదో చెప్పబోతోంటే, ఆవిడ అడ్డం పడింది.

"ఉద్యోగం ఉంది కాబట్టే రోజులు నిశ్చింతగా గడుస్తున్నాయి. అయితే మాత్రం నువ్వు ఒక్కదానివే బతుకు బండిని లాగాల్సిందే కదా... రంగా తండ్రి గురించి వివరాలు నేనూ నిన్ను అడగను... నావీ అడగవద్దని చెప్పాకదా మరీ! అయినా మీ ఇద్దరూ నా జీవితంలో భాగం అయిపోయారు. నన్ను ప్రేమగా అమ్మమ్మా అని పిలిచే వాడి పిలుపు నాకూ వాడి భవిష్యత్తు కోసం ఖర్చు పెట్టే హక్కును ఇచ్చింది. ఇది మాత్రం నువ్వు కాదనటానికేమీ లేదు.." ఖచ్చితంగా చెప్పిన గోదారమ్మ మళ్ళీ.." అయినా ఇప్పటికి నేను నీకు చేసిందేమీ పెద్దగా లేనే లేదు... డబ్బులు జాగ్రత్తగానే ఖర్చు పెడుతున్నా...ముందు ముందు ఎన్ని ఖర్చులు వస్తాయో తెలియదుకదా..." అంది గోదావరమ్మ నిట్టూరుస్తూ.

అక్కడితో ఆ సంభాషణ ఆ రోజు ముగిసింది.

మర్నాడు సీతకు స్కూలు లేకపోవటంతో  ఇంటి దగ్గరే ఉంది.

ఒకావిడ వస్తే “రా... కనకమ్మా...” అంటూ సీత ఆహ్వానించింది. లోపలకు వచ్చి కూర్చోమంటే...

“వద్దులే సీతా... ఇక్కడే కూర్చుంటాలే...” అంటూ వరండాకి ఉన్న మెట్లమీదే చతికిలబడి కూర్చుంటూ... ‘‘ గయ్యాళి గవరమ్మ వస్తానని చెప్పింది దార్లో కనబడి. ఏవో సరుకులు కొన్నది. అవి ఇంట్లో ఇచ్చేసి వస్తానని చెప్పింది. కబుర్లు అంటే దానికీ మహా ప్రీతిలే..” అంది నవ్వు మొహంతో.

సీత చిన్నగా నవ్వింది “అదేమిటి కనకమ్మత్తా... గవరమ్మ పిన్నికి ఇంటిపేరు గయ్యాళి అని పెట్టేసావూ...?” అనడిగింది.

కనకమ్మ పకపకలాడింది.

“పేరు నేను పెట్టింది కాదు తల్లోయ్... వాళ్ళ ఇరుగూ పొరుగూ అలా అనటం వినటం వల్లే నాకూ అలా వచ్చేసిందంతే! అస్తమానూ కోడల మీద నోరేసుకుని అరుస్తూ ఉంటుందంట! ఆ పిల్ల బదులేం చెబుతుందో ఎవరికీ వినబడదు గానీ... గవరమ్మ గొంతు మాత్రం ఖంగుమంటూ అందరికీ వినబడుతూ ఉంటుంది! అందుకే ‘గయ్యాళి గవరమ్మ’గా పేరు మారిపోయింది మరి!”

సీత మళ్ళీ చిన్నగా నవ్వింది.

కనకమ్మ మళ్ళీ అంది “అవునూ... మీ పెద్దమ్మ ఎవరో వచ్చి... నీతోపాటే ఉంటున్నారని విన్నానూ... కనుపించదేం...?” అటూ ఇటూ చూసింది.

“లోపల ఏదో పుస్తకం చదువుకుంటూ ఉన్నట్లున్నారు... పిలుస్తానుండు...” అంటూ సీత లోపలి గదిలోకి వెళ్ళింది.

గోదారమ్మ రాగానే కనకమ్మ గురించి చెప్పింది సీత. లోపలికి రమ్మనగానే ఆవిడకు సీత చెప్పింది.

“ఇంకో ఆవిడా వస్తానందిట. అందుకని ఇక్కడే కూర్చుంటానంది” అంటూ ఆ మెట్లమీదే తనూ కూర్చుంటూ గోదావరమ్మకి మాత్రం మెట్లకి కొంచెం దగ్గరగా స్టూలు జరిపింది... ఆవిడ కూర్చోవటానికన్నట్లుగా.

గోదావరమ్మ వైపు పరీక్షగా చూసింది కనకమ్మ...తర్వాత ఆరా తీస్తున్నట్లుగా కొంచెం గొంతు తగ్గించి అడిగింది..."అవునూ... మీరు... నాగులమ్మకి ఇల్లు కట్టుకోమని డబ్బు ఇచ్చారట! నిజమేనా...? అది అందరితో విషయం చెబుతుంటే నేనూ విన్నాను... అందుకే మిమ్మల్ని అడుగుదామనీ..."

గోదారమ్మ కూడా నెమ్మదిగానే జవాబిచ్చింది.. "ఇచ్చిన మాట నిజమేగానీ 'అందరికీ చెప్పొద్దనే' మాట అనకపోవటం వలన అలా అందరికీ చెబుతోంది కాబోలు! అనవసరమైన ప్రచారం కదా! సగం కాలిపోగా మిగిలిన ఇంటిలోనే తనూ తన కొడుకూ కాలక్షేపం చేస్తున్నామని మాటల మధ్యలో చెబితేనూ, సరే ఏదో కొంచెం సాయం చేద్దామనిపించి ఉన్నదాంట్లో ఇచ్చాను... అంతే...!" అదేం గొప్ప విషయం కాదన్నట్లుగా ఆవిడ తేల్చేసింది.

కనకమ్మ మళ్ళీ అదే గొంతుతో రహస్యంగా అంది. "మీరు మరోలా అనుకోకండి నేనో మాట చెబుతాను. మీ దగ్గర డబ్బు ఉండి, ధర్మకార్యాలు చేయాలనిపించి, దానాలు గట్రా చేయాలనుకుంటే... మా లాంటి వాళ్ళకు ఇవ్వండి. పుణ్యమూ, పురుషార్థమునూ. ఆ కులం తక్కువ వాళ్ళకి ఎంత ఇస్తే మాత్రం ఏమిటి...! మనమూ మనమూ ఒక కులం వాళ్ళం! మావాడు ఉన్నాడు... ఏదో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు! వాడికి మీరు ఏదైనా ఇస్తే... వాడికి ప్రయోజనం కలుగుతుంది. మీకు కావలిసిన పుణ్యమూ దక్కుతుంది. నేనీ మాట మీకు చెప్పి వస్తానని వాడికీ చెప్పాను. మీరు ఎంత ఇవ్వదలచుకున్నారో ఓ మాట చెబితే, వాడికీ చెవిని వేస్తాను దాన్ని బట్టి ఏం చేయగలడో ఆలోచిస్తాడు!"

ఆ మాటలకు గోదావరమ్మ నిర్ఘాంతపోయింది! ఆవిడ వచ్చిన పనేమిటో అర్థమైంది!